జ్వాల
# దశ
నిజం.. నిర్భయంగా..

WWW.DASHANEWS.COM
బుధవారం
28 01 2026
సంపుటి 1 సంచిక 67
పేజీలు : 04
PRGI No : TGTEL/25/A4195

దశ పత్రికలో పనిచేసేందుకు జీహెచ్ఎంసీ పరిధిలో రిపోర్టర్లు కావలెను. సీనియర్ రిపోర్టర్లకు తగిన పారితోషికం ఇవ్వబడును.
7337 54 6647
9848 28 8850




# నేటి నుంచే నామినేషన్లు

## తెలంగాణ మున్సిపల్ ఎన్నికల నోటిఫికేషన్ విడుదల

అమల్లోకి ఎన్నికల కోడ్..

ఫిబ్రవరి 11న పోలింగ్.

ఫిబ్రవరి 13న ఓట్ల లెక్కింపు.

ఫిబ్రవరి 16 - మున్సిపల్ ఛైర్మన్, వైస్ ఛైర్మన్ కార్పొరేషన్ మేయర్, డిప్యూటీ మేయర్ ఎన్నిక.

**మున్సిపల్ ఎన్నికల్లో సుమారు 53 లక్షల మందికి పైగా ఓటర్లు తమ ఓటు హక్కును వినియోగించుకోనున్నారు.**

**దశ, హైదరాబాద్ :** తెలంగాణలో మున్సిపల్ ఎన్నికల నోటిఫికేషన్ విడుదలైంది. రాష్ట్ర ఎన్నికల కమిషనర్ రాణి కుముదిని రాష్ట్ర వ్యాప్తంగా ఉన్న 116 మున్సిపాలిటీలు, 7 కార్పొరేషన్ల ఎన్నికలకు సంబంధించిన నోటిఫికేషన్ విడుదల చేశారు. ఎన్నికల సంఘం విడుదల చేసిన నోటిఫికేషన్ ప్రకారం.. రాష్ట్ర వ్యాప్తంగా ఒకే విడతలో మున్సిపల్ ఎన్నికలు జరుగనున్నాయి. జనవరి 28వ తేదీ నుంచి మున్సిపల్ ఎన్నికలకు సంబంధించి నామినేషన్లు స్వీకరించనున్నారు. నామినేషన్లు దాఖలు చేయడానికి జనవరి 30 వరకు అవకాశం కల్పించారు. అలాగే 31వ తేదీన నామినేషన్ల స్క్రూటినీ ఉంటుంది. నామినేషన్ల ఉపసంహరణకు ఫిబ్రవరి 3వ తేదీ వరకు అవకాశం ఇచ్చారు.
ఫిబ్రవరి 11వ తేదీన పోలింగ్ నిర్వహించి.. 13వ తేదీన కౌంటింగ్ నిర్వహించనున్నారు. ఫిబ్రవరి 16వ తేదీన చైర్ పర్సన్స్, మేయర్ల ఎన్నిక ప్రక్రియ చేపడతారు. రాష్ట్ర వ్యాప్తంగా 116 మున్సిపాలిటీలు, 7 కార్పొరేషన్లకు ఎన్నికలు నిర్వహించనున్నారు. ఈ ఎన్నికల్లో 52.43 లక్షల మంది ఓటర్లు తమ ఓటు హక్కును వినియోగించుకోనున్నారు. మొత్తం 2,996 వార్డులకు ఎన్నికలు నిర్వహిస్తుండగా.. 8203 పోలింగ్ కేంద్రాలు ఏర్పాటు చేశారు. ఓట్ల కౌంటింగ్ కోసం 136 కౌంటింగ్ కేంద్రాలు ఏర్పాటు చేశారు.

### అమల్లోకి ఎన్నికల కోడ్..

మున్సిపల్ ఎన్నికల నిర్వహణకు సంబంధించి నోటిఫికేషన్ విడుదలైన నేపథ్యంలో రాష్ట్ర వ్యాప్తంగా ఎన్నికల కోడ్ అమల్లోకి వచ్చింది. ఎన్నికల కోడ్ నిబంధనలను ఉల్లంఘించిన వారిపై కఠిన చర్యలు తీసుకోవడం జరుగుతుందని ఎన్నికల అధికారులు స్పష్టం చేశారు. ఎన్నికల కోడ్ నేపథ్యంలో పోలీసులు సైతం ఎక్కడికక్కడ తనిఖీలు ముమ్మరం చేశారు.



# వనదేవతల రాకకు వేళాయే..

## 4 వేల ప్రత్యేక బస్సులు.. 1,418 ఎకరాల్లో పార్కింగ్
## AI డ్రోన్లు, భారీగా భద్రతా సిబ్బంది

3లో

### రాష్ట్ర ప్రజలకు మేడారం జాతర శుభాకాంక్షలు తెలిపిన సీఎం రేవంత్



**దశ, హైదరాబాద్:** మేడారం సమ్మక్క-సారలమ్మ జాతరకు వెళ్లేవారికి, రాష్ట్ర ప్రజలకు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి శుభాకాంక్షలు తెలిపారు. భక్తులు అమ్మవార్ల దర్శనంతో కృపకు పాత్రులై, ఆధ్యాత్మిక శాంతిని పొందాలని సీఎం ఆకాంక్షించారు. దర్శనానంతరం ప్రతి ఒక్కరూ క్షేమంగా తమ తమ ఇళ్లకు చేరుకోవాలని సూచించారు. మేడారం జాతరకు అవసరమైన అన్ని ఏర్పాట్లు ఇప్పటికే పూర్తయ్యాయని సీఎం తెలిపారు. యాత్రికులకు ఎలాంటి అసౌకర్యాలు కలగకుండా ప్రభుత్వం అన్ని చర్యలు తీసుకుందని స్పష్టం చేశారు. జాతర ఏర్పాట్లపై ముఖ్య కార్యదర్శి రామకృష్ణారావుకు సీఎం కీలక ఆదేశాలు జారీ చేశారు. భక్తుల భద్రత, సౌకర్యాలు అత్యంత ప్రాధాన్యంగా ఉండాలని, ఎక్కడా లోటుపాట్లు లేకుండా పర్యవేక్షణ కొనసాగించాలని సూచించారు.

### మేడారం జాతర ఒక ఆధ్యాత్మిక కుంభమేళా: కేసీఆర్



**దశ, హైదరాబాద్:** మేడారం సమ్మక్క సారలమ్మ జాతర ప్రారంభం సందర్భంగా, తెలంగాణ తొలి ముఖ్యమంత్రి, బీఆర్ఎస్ అధినేత కేసీఆర్ రాష్ట్ర ప్రజలకు శుభాకాంక్షలు తెలిపారు. తెలంగాణ త్యాగానికి, ధిక్కారానికి ఆదివాసీ దేవతలు సమ్మక్క సారలమ్మలు ప్రతీకలని కేసీఆర్ అన్నారు. కొంగు బంగారమై, కోరిన కోరికలు తీర్చే తమ ఇలవేల్పులకు మొక్కులు తీర్చుకునేందుకు, కోట్లాదిగా తరలివచ్చే భక్తులతో మేడారం జాతర కుంభమేళాను తలపిస్తూ ఆధ్యాత్మిక కేంద్రమై కొనసాగుతుందని తెలిపారు. తెలంగాణ ఆదివాసీ గిరిజన సమాజాల సబ్బండ కులాల సంస్కృతి, సంప్రదాయాలకు పదేండ్ల బీఆర్ఎస్ పాలన పెద్దపీట వేసిందని కేసీఆర్ పేర్కొన్నారు. గోదావరి లోయ పరీవాహక ప్రగతితో సమాంతరంగా సాగిన ఆధ్యాత్మిక అభివృద్ధిని ఈ సందర్భంగా కేసీఆర్ స్మరించుకున్నారు.

## అమెజాన్‌లో భారీ లేఆఫ్స్..

16,000 మందిని తొలగించేందుకు రంగం సిద్ధం.




**దశ, హైదరాబాద్:** ప్రపంచవ్యాప్తంగా అనేక సంస్థల్లో ఉద్యోగుల తొలగింపు కొనసాగుతూనే ఉంది. ఇప్పటికే వేల సంఖ్యలో ఉద్యోగుల్ని తొలగించిన అమెజాన్.. ఇప్పుడు మరోసారి భారీ సంఖ్యలో ఉద్యోగాల కోతకు సిద్ధమవుతోందని సమాచారం. నేటి నుంచే ఉద్యోగుల్ని తొలగించబోతుంది. ఈసారి దాదాపు 16,000 మందిని తీసేయాలని నిర్ణయించినట్లు తెలుస్తోంది.నేటి నుంచి వారం రోజుల్లోపు ఇందుకు సంబంధించి ఆదేశాలొచ్చే అవకాశం ఉంది. గత ఏడాది చివర్లో అమెజాన్ సంస్థ దాదాపు 14,000 మంది స్టాఫ్‌ను తొలగించింది. ఇప్పుడు మరో 16,000 మందిని తొలగించనుంది. అంటే ఆరు నెలల వ్యవధిలోనే దాదాపు 30,000 మందిని తొలగించినట్లవుతుంది. అంతకుముందు 2023లో 27,000 మందికి ఉద్వాసన పలికింది. ఏఐ, ఆటోమేషన్ కారణంగానే ఉద్యోగుల కోత జరుగుతోందని విశ్లేషకుల అంచనా. అమెజాన్‌లో రిటైల్, వేర్‌హౌజ్ సిబ్బందితోపాటు హై శాలరీ కార్పొరేట్, అడ్మినిస్ట్రేషన్ ఉద్యోగుల్ని కూడా కంపెనీ తొలగిస్తోంది

# మంత్రుల భేటీ.. తప్పేముంది: మహేష్ గౌడ్

## మంత్రులు సమావేశం కావడం తెలంగాణ రాజకీయ వర్గాల్లో చర్చకు దారి



**దశ, హైదరాబాద్:** హైదరాబాద్‌లోని ప్రజాభవన్‌లో సోమవారం రాత్రి తెలంగాణ ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్కతో మంత్రులు ఉత్తమ్‌కుమార్‌రెడ్డి, శ్రీధర్‌బాబు, అడ్లూరి లక్ష్మణ్ భేటీ అయ్యారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ప్రస్తుతం దేశంలో లేని సమయంలో నలుగురు మంత్రులు సమావేశం కావడం తెలంగాణ రాజకీయ వర్గాల్లో చర్చకు దారి తీసింది. లోక్‌భవన్‌లో గవర్నర్ నిర్వహించిన 'ఎట్ హోం' కార్యక్రమంలో పాల్గొన్న అనంతరం మంత్రులు అక్కడ నుండి నేరుగా ప్రజాభవన్‌కు వెళ్లారు. సీఎం రేవంత్ అమెరికాలో లీడర్ షిప్ కోర్సు చేసేందుకు వెళ్లిన సమయంలో మంత్రులు భేటీ కావడంపై విపక్షాలు భిన్నంగా స్పందిస్తున్నాయి.ఈ భేటీలో మంత్రులు రాష్ట్ర రాజకీయ పరిణామాలు, త్వరలో జరగనున్న మున్సిపల్ ఎన్నికల వ్యూహాలపై సుదీర్ఘంగా చర్చించినట్లు తెలుస్తోంది. అదే రోజు మధ్యాహ్నం జగిత్యాల మాజీ ఎమ్మెల్యే జీవన్‌రెడ్డి మంత్రి ఉత్తమ్ నివాసానికి వెళ్లి కలిశారు. నిజామాబాద్ లోక్‌సభ కి మున్సిపల్ ఎన్నికల పార్టీ ఇన్‌ఛార్జిగా ఉత్తమ్ ఉన్నారు. జగిత్యాల కూడా అదే పరిధిలో ఉండటంతో

..మిగతా 4వ పేజీలో →

### ఏ పార్టీలో ఉంటే ఆ పార్టీ కండువా కప్పుకోవాలి: డీకే అరుణ.




**దశ, జోగులాంబ గద్వాల**

గద్వాల ఎమ్మెల్యే బండ్ల కృష్ణమోహన్ రెడ్డి ఏ పార్టీలో ఉంటే ఆ పార్టీ కండువా కప్పుకోవాలని మహబూబ్ నగర్ బీజేపీ ఎంపీ డీకే అరుణ డిమాండ్ చేశారు. గద్వాల పట్టణంలోని బీజేపీ కార్యాలయంలో మంగళవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఎంపీ డీకే అరుణ మాట్లాడుతూ.. గద్వాల ఎమ్మెల్యే బండ్ల కృష్ణమోహన్ రెడ్డిపై

..మిగతా 4వ పేజీలో →



# దశల వారీగా అభివృద్ధి పనులు

## శివారు డివిజన్ల కాలనీలలో మౌలిక సదుపాయల కల్పనకు కృషి

జిహెచ్ఎంసి ఎల్బీనగర్ జోనల్ కమీషనర్ హేమంత్ కేశవ్ పాటిల్ తో కలిసి పర్యటించి ప్రజల సమస్యలను అడిగి తెలుసుకున్న ఎమ్మెల్యే మల్రెడ్డి రంగారెడ్డి.

వివరాలు 4లో

# దశల వారీగా అభివృద్ధి పనులు





**దశ, పెద్ద అంబర్ పేట:** జిహెచ్ఎంసి పరిధిలో నూతనంగా ఏర్పాడిన శివారు డివిజన్ల కాలనీలలో మౌలిక సదుపాయల కల్పనకు అధికార్లు కృషి చేయాలని ఇబ్రహింపట్నం ఎమ్మెల్యే మల్రెడ్డి రంగారెడ్డి కోరారు. మంగళవారం జిహెచ్ఎంసి నాగోల్ నర్కిల్ 11 వరిధిలోని పెద్ద అంబర్పేట్, కుంట్లూరు డివిజన్ పరిధిలోని కాలనీలో ఎమ్మెల్యే మల్రెడ్డి రంగారెడ్డి, జిహెచ్ఎంసి ఎల్బీనగర్ జోనల్ కమీషనర్ హేమంత్ కేశవ్ పాటిల్ తో కలిసి పర్యటించి ప్రజల సమస్యలను అడిగి తెలుసుకున్నారు. అనంతరం పెద్ద అంబర్పేట్ డివిజన్ లక్ష్మారెడ్డిపాలెంలోని ఎన్ఎన్ఆర్ కళా కన్వెన్షన్లో అధికార్లతో కలిసి సమీక్ష సమావేశం నిర్వహించి పలు కాలనీల్లో నెలకొన్న సమస్యలపై చర్చించారు. ఈ సందర్భంగా సమవేశంలో వివిధ విభాగాల అధికార్లను పరిచయం చేయించారు. అనంతరం ఎమ్మెల్యే మల్రెడ్డి రంగారెడ్డి మాట్లాడుతూ శివారులోని మున్సిపాలిటీలను జిహెచ్ఎంసి విలీనం చేయడంతో ప్రజలో కొంత గందరగోళం ఉందనే ఉద్దేశంతో అధికార్లతో సమావేశం ఏర్పాటు చేసి ప్రజలకు అవగాహన కల్పించి నివృత్తి చేస్తున్నామని తెలిపారు. అభివృద్ధి దశలో నడిచే మున్సిపాలిటీలను జిహెచ్ఎంసిలో విలీనం చేయడం ద్వార నిధుల కేటాయింపు చిన్నచూపు లేకుండా అధికార్లు ప్రత్యేక దృష్టితో అభివృద్ధిలో మరింత ముందుకు తీసుకెళ్లాలని సూచించారు. అదేవిధంగా నూతనంగా ఏర్పాడిని పెద్దఅంబర్పేట్(52), కుంట్లూరు(51) డివిజన్ల కాలనీలో కనీస వసతుల కల్పంచి అభివృద్ధి పధంలో నడిపించేందకు గాను రూ.100 కోట్ల నిధులు కేటాయించాల్సిన అవసరం ఉందన్నారు. ప్రతి విభాగం అధికార్లు ప్రజలకు అందుబాటులో ఉండి పని చేయాలని సూచించారు. ఏవరైన అధికార్లు పని విషయంలో నిర్లక్ష్యం వహిస్తే ప్రభుత్వనికి చేడ్డ పేరు వస్తుందని, అలాంటి వారి పట్ల కఠిన చర్యలు తీసుకుంటామని పేర్కొన్నారు. కాలనీ సమస్యలు అధికార్ల దృష్టికి వచ్చిన వెంటనే స్పందించి పరిష్కరించాలని సూచించారు. అనంతరం పలు కాలనీ సంక్షేమ సంఘాల ప్రతినిధుల నుండి వినతి పత్రలను స్వీకరించారు. ఈ కార్యక్రమంలో జాయింట్ కమిషనర్ కృష్ణకుమారి, చీఫ్ ఇంజనీర్ అశోక్ రెడ్డి, నాగోల్ సర్కిల్ 11 డిప్యూటీ కమిషనర్ ఎస్.రవీంధర్ రెడ్డి , తహసీల్దార్ సుదర్షన్ రెడ్డి , కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు కొత్తపల్లి జైపాల్ రెడ్డి , వివిధ విభాగాల అధికారులు, కాలనీ వాసులు, నాయకులు పాల్గొన్నారు.

# కేబినెట్ లో కోల్డ్ వార్..

## భట్టి వర్సెస్ కోమటిరెడ్డి

## సింగరేణి నైనీ బ్లాక్ టెండర్ల వ్యవహారం



**దశ , హైదరాబాద్:** తెలంగాణలో సింగరేణి నైనీ బ్లాక్ టెండర్ల వ్యవహారం రేవంత్ రెడ్డి ప్రభుత్వాన్ని ఆత్మరక్షణలో పడేసింది. ఈ వ్యవహారం కేవలం ఒక టెండర్ రద్దుకు పరిమితం కాకుండా, ప్రభుత్వంలోని అంతర్గత కుమ్ములాటలను, ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి వైఫల్యాలను ఎత్తిచూపుతోంది. ఒక మీడియా సంస్థ బయటపెట్టిన ఈ డొల్లతనం ఇప్పుడు రాష్ట్ర రాజకీయాల్లో హాట్ టాపిక్ గా మారింది.ఒడిశాలోని నైనీ కోల్ బ్లాక్ తవ్వకాలకు సంబంధించి పిలిచిన టెండర్లలో సైట్ విజిట్ అనే నిబంధనను చేర్చడం వెనుక పెద్ద వ్యూహమే ఉందనేది తాజా ఆరోపణల సారాంశం. సాధారణంగా ఇలాంటి టెండర్లలో పారదర్శకత కోసం పోటీని ప్రోత్సహిస్తారు. కానీ, ఈ నిబంధన వల్ల ఒక ప్రముఖ మీడియా సంస్థ అధిపతికి చెందిన కంపెనీకి మాత్రమే లబ్ధి చేకూర్చేలా నిబంధనలు రూపొందించారనే వార్తలు గుప్పుమన్నాయి.డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క నేతృత్వంలోని ఇంధన శాఖ పరిధిలో జరిగిన ఈ ప్రక్రియపై విమర్శలు రావడంతో ప్రభుత్వం వెనక్కి తగ్గింది. టెండర్లు రద్దు చేస్తూ భట్టి విక్రమార్క ప్రకటన చేసినప్పటికీ, అప్పటికే జరగాల్సిన నష్టం జరిగిపోయింది. ప్రభుత్వ పారదర్శకతపై మచ్చ పడింది. వాస్తవానికి సహచర మంత్రి కోమటిరెడ్డి వెంకట్ రెడ్డి సోదరుడు కోమటిరెడ్డి రాజగోపాల్ రెడ్డి కంపెనీకి టెండర్ దక్కకుండా చేసేందుకే భట్టి విక్రమార్క ఈ నిబంధన తెరపైకి తెచ్చారనేది ఆరోపణ. అంటే రేవంత్ కేబినెట్ లోని ఇద్దరు మంత్రుల మధ్య ఆధిపత్యపోరుకు ఇది నిదర్శనం.ఈ వ్యవహారంలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అనుసరించిన తీరు రాజకీయ విశ్లేషకులను ఆశ్చర్యానికి గురి చేస్తోంది. తన కేబినెట్ మంత్రుల మధ్య తలెత్తిన వివాదాన్ని పరిష్కరించాల్సింది పోయి, రేవంత్ రెడ్డి దీనిని రెండు మీడియా సంస్థల వార్ గా అభివర్ణించి చేతులు దులుపుకునే ప్రయత్నం చేశారు. రెండు మీడియా హౌజ్ ల గొడవలోకి మమ్మల్ని లాగొద్దు అంటూ ఆయన చేసిన వ్యాఖ్యలు బాధ్యతాయుతమైన పదవిలో ఉన్న వ్యక్తికి తగవనే విమర్శలు వస్తున్నాయి. వాస్తవానికి, ఇది మీడియా సంస్థల మధ్య గొడవ కాదు. న కేబినెట్ లోని నెంబర్ 2 స్థానంలో ఉన్న మంత్రి తీసుకున్న నిర్ణయం తప్పు అని తెలిసినప్పుడు ముఖ్యమంత్రిగా జోక్యం చేసుకుని సరిదిద్దాల్సిన బాధ్యత రేవంత్ రెడ్డిపైన ఉంటుంది. కేబినెట్ లో ఇద్దరి మధ్య వివాదం రేగినప్పుడు, ఇద్దరినీ కూర్చోబెట్టి సమస్యను పరిష్కరించాలి. కానీ ఆ పని చేయడంలో రేవంత్ రెడ్డి విఫలమయ్యారని స్పష్టమవుతోంది.నైనీ బ్లాక్ ఇష్యూలో ప్రభుత్వం ఇరకాటంలో పడడంతో, ప్రజల దృష్టిని మళ్లించడానికి పాత కేసులను తెరపైకి తెస్తున్నారనే ఊహాగానాలు గట్టిగా వినిపిస్తున్నాయి. ముఖ్యంగా ఫోన్ ట్యాపింగ్ ఇష్యూను మళ్ళీ చర్చల్లోకి తీసుకురావడం ద్వారా నైనీ బ్లాక్ వివాదాన్ని అణచివేసే ప్రయత్నం రేవంత్ రెడ్డి చేస్తున్నారని రాజకీయ వర్గాల్లో చర్చ జరుగుతోంది. ఇది సమస్యను పరిష్కరించడం కాకుండా, కేవలం డ్యామేజ్ కంట్రోల్ కోసం చేస్తున్న రాజకీయ విన్యాసంగా కనిపిస్తోంది. నైనీ బ్లాక్ వ్యవహారం రేవంత్ రెడ్డి టీమ్‌లోని గందరగోళాన్ని బహిర్గతం చేసింది. కేబినెట్ లోని ఆధిపత్య పోరును సకాలంలో సర్దుబాటు చేయకపోవడం వల్లే ఇది ఇంతటి వివాదానికి దారితీసింది. ఇప్పటికైనా రేవంత్ రెడ్డి మీడియా చాటున దాక్కోకుండా, పాలనలో పారదర్శకతను, మంత్రుల మధ్య ఐక్యతను నిరూపించుకోవాల్సిన అవసరం ఉంది. లేదంటే డొల్లతనం అనే ముద్ర ప్రభుత్వానికి శాశ్వతంగా పడిపోయే ప్రమాదం ఉంది.

# మల్లేశం పల్లిలో పురాతన మల్లన్న ఆలయం



**దశ, దౌల్తాబాద్:** సిద్దిపేట జిల్లా దౌల్తాబాద్ మండలంలోని ఎన్నో ఏళ్లనాటి పురాతన మల్లన్న ఆలయం చుట్టూ చెట్లు, పొదలు పెరగడంతో ఎవరికి కనిపించకుండా.. ఎలాంటి పూజలకు నోచుకోకుండా శిథిలావస్థలో చేరుకుంది. ఈ ఆలయ నేపథ్యం గురించి సోషల్ మీడియాలో వైరల్ కావడంతో గ్రామంతో పాటు శివారు గ్రామాల ప్రజల చూపు మల్లన్న ఆలయంపై పడింది. తమ గ్రామ శివారులో ఉన్న ఆలయంను ఇన్ని రోజులు గుర్తించలేకపోయామని గ్రామస్థులు వాపోయారు. ఆలయంపై సోషల్ మీడియాలో వచ్చిన కథనాన్ని చూసిన మల్లేశంపల్లి వార్డు మెంబర్ మిర్గం రమేష్ స్పందిస్తూ.. ఆలయం చుట్టు ఉన్న చెట్లను తొలగించి... పరిసర ప్రాంతాన్ని శుభ్రం చేసి ఆలయానికి పూర్వ వైభవాన్ని తీసుకువస్తామని చెప్పారు. అంతేకాకుండా గుడి నేపథ్యం అదరికి తెలిసేలా.., వేదపండితుల సూచనలతో ఆలయంలో విశిష్ట పూజలు జరిపేందుకు గ్రామ పాలక వర్గంతో కలిసి తగు చర్యలు తీసుకుంటాం అన్నారు. పురాతన మల్లన్న ఆలయానికి మెరుగులు దిద్దీ భక్తులకు అందుబాటులోకి తీసుకురావాలని గ్రామస్తులు కోరారు.

# వారానికి 5 రోజులు పని కావాలి

## స్తంభించిన బ్యాంకింగ్ సేవలు




**దశ , ముంబై:** వారానికి ఐదు రోజుల పనిదినాలు అమలు చేయాలనే ప్రధాన డిమాండ్‌తో దేశవ్యాప్తంగా బ్యాంక్ ఉద్యోగులు మంగళవారం సమ్మెకు దిగారు. యునైటెడ్ ఫోరమ్ ఆఫ్ బ్యాంక్ యూనియన్స్ (యూఎఫ్‌బీయూ) పిలుపు మేరకు జరిగిన ఈ సమ్మెతో బ్యాంకింగ్ సేవలకు తీవ్ర అంతరాయం కలిగింది. నగదు డిపాజిట్లు, విత్‌డ్రాయల్స్, చెక్కు క్లియరెన్సులు వంటి రోజువారీ లావాదేవీలు నిలిచిపోవడంతో ఖాతాదారులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొన్నారు.దేశంలోని దాదాపు అన్ని ప్రభుత్వ రంగ బ్యాంకులకు చెందిన ఉద్యోగులు ఈ సమ్మెలో పాల్గొన్నారు. గుజరాత్‌లోని వడోదర, పశ్చిమ బెంగాల్‌లోని కూచ్‌బెహార్, ఉత్తరప్రదేశ్‌లోని ఘాజీపూర్, ఛత్తీస్‌గఢ్‌లోని రాయ్‌పూర్ సహా అనేక నగరాల్లో ఉద్యోగులు పెద్ద సంఖ్యలో నిరసన ప్రదర్శనలు చేపట్టారు. ఐదు రోజుల పని విధానం కోసం ప్రభుత్వానికి చాలాసార్లు వినతిపత్రాలు సమర్పించినా ఎలాంటి స్పందన లేకపోవడంతో సమ్మెబాట పట్టాల్సి వచ్చిందని ఉద్యోగ సంఘాల నేతలు తెలిపారు."ఈరోజు సమ్మెలో దేశవ్యాప్తంగా 8 లక్షల మందికి పైగా ఉద్యోగులు పాల్గొంటున్నారు. 2015 నుంచి మా డిమాండ్ పెండింగ్‌లోనే ఉంది. ఎల్ఐసీ, కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వ కార్యాలయాల్లో ఇప్పటికే వారానికి 5 రోజుల పనివిధానం అమలవుతోంది. బ్యాంకుల్లోనూ అమలు చేస్తామని హామీ ఇచ్చినా ఇంతవరకు కార్యరూపం దాల్చలేదు" అని ఓ ఉద్యోగి ఆవేదన వ్యక్తం చేశారు.ఇండియన్ బ్యాంక్స్ అసోసియేషన్ (ఐబీఏ)తో జరిగిన ద్వైపాక్షిక ఒప్పందంలో భాగంగా ఆరు నెలల్లోనే 5 రోజుల పనిదినాలు అమలు చేస్తామని హామీ ఇచ్చారని, కానీ రెండేళ్లు గడిచినా ఆ హామీ నెరవేరలేదని పాట్నాలో ఉద్యోగులు తెలిపారు. "ఆర్‌బీఐ, నాబార్డ్, సెబీ వంటి సంస్థలన్నీ 5 రోజులే పనిచేస్తున్నాయి. మాకు మాత్రం ఎందుకు అమలు చేయడం లేదు?" అని వారు ప్రశ్నించారు. యూపీలోని ఘాజీపూర్ జిల్లాలో దాదాపు 250 బ్యాంకులకు చెందిన 10,000 మంది ఉద్యోగులు సమ్మెలో పాల్గొనడంతో సుమారు రూ.150 కోట్ల విలువైన లావాదేవీలు నిలిచిపోయాయి. ప్రభుత్వ హామీ నెరవేరే వరకు తమ పోరాటం కొనసాగుతుందని ఉద్యోగ సంఘాలు స్పష్టం చేశాయి.

# ఏ పార్టీలో ఉంటే ఆ పార్టీ కండువా కప్పుకోవాలి: డీకే అరుణ.

**మొదటి పేజీ తరువాయి**

మండిపడ్డారు.గద్వాల పట్టణంలో ఎవరికి ఓటు అడిగే హక్కు లేదని, ఎవరు ఏమి అభివృద్ధి చేశారో పట్టణ ప్రజలకు తెలుసని అన్నారు. తెలంగాణ స్పీకర్ ఇచ్చిన తీర్పు ప్రకారం గద్వాల ఎమ్మెల్యే బండ్ల కృష్ణమోహన్ రెడ్డి ఏ పార్టీలో ఉన్నాడో ఆ పార్టీ కండువా కప్పుకుని ఎన్నికల్లో తిరగాలని ఎంపీ డీకే అరుణ డిమాండ్ చేశారు.స్పీకర్ నిర్ణయాన్ని ఎమ్మెల్యే బండ్ల గౌరవించాలన్నారు. బీఆర్ఎస్‌లో గెలిచిన ఎమ్మెల్యే బండ్ల ఇప్పుడున్నది కాంగ్రెస్ పార్టీలోనని గద్వాల ప్రజలందరికీ తెలుసు. తాను కాంగ్రెస్‌లో ఉన్నా అని చెబితే.. కాంగ్రెస్ కండువా వేసుకొని తిరిగితే ఎమ్మెల్యే పదవి ఊడిపోతదని ఎమ్మెల్యే బండ్ల ఏదో అబద్ధాలు చెప్పుకుంటూ తిరుగుతున్నరన్నారు. ఆయన ఏ మొహం పెట్టుకుని మున్సిపల్ ఎన్నికల్లో ప్రచారం చేస్తారన్నారని ప్రశ్నించారు.ఏ పార్టీలో ఉంటే ఆ పార్టీ పాట పాడటం గద్వాల ఎమ్మెల్యే బండ్ల కృష్ణమోహన్ రెడ్డికే సొంతమని డీకే అరుణ అన్నారు. గద్వాల పట్టణ అభివృద్ధి కోసం తనవంతు కృషి చేస్తానని, పట్టణ ప్రజలు గద్వాల అభివృద్ధి కావాలంటే బీజేపీకి పట్టం కట్టాలని డీకే అరుణ కోరారు.

# గుంపు మేస్త్రికీ ప్రధాన గూఢచారియే సంతోష్ రావు: కవిత

**దశ , హైదరాబాద్**

నిజామాబాద్ లో గంజాయి ముఠా దాడిలో తీవ్రంగా గాయపడిన ఎక్సైజ్ కానిస్టేబుల్ సౌమ్యను, ఆమె కుటుంబ సభ్యులను హైదరాబాద్ లోని నిమ్స్ హాస్పిటల్ లో తెలంగాణ జాగృతి అధ్యక్షురాలు కల్వకుంట్ల కవిత పరామర్శించారు. సౌమ్య కుటుంబానికి అండగా ఉంటామని హామీ ఇచ్చారు. కవిత మాట్లాడుతూ గుంపు మేస్త్రికీ ప్రధాన గూఢచారియే సంతోష్ రావు. కేసీఆర్ తినే ఇడ్లి సమాచారాన్ని కూడా రేవంత్ రెడ్డికి చేరవేసే వ్యక్తే ఆయన. తన గూఢచారికి శిక్షపడకుండా రేవంత్ రెడ్డి కాపాడుకునే పరిస్థితి ఉందని అన్నారు. కేసీఆర్ కు ఉద్యమకారులను, అమరవీరుల కుటుంబాలను దూరం చేసిన దుర్మార్గుడు. పోలీసులు నిజాయితీగా పనిచేస్తే సంతోష్ రావు కు కచ్చితంగా శిక్ష పడుతుంది. నేను చెప్పిన దయ్యాల్లో మొదటి దెయ్యం సంతోష్ రావే. ఆయనకు హరీష్ రావు, కేటీఆర్ లు ఎందుకు వత్తాసు పలుకుతున్నారో అర్థం కావటం లేదు. గంజాయి, డ్రగ్స్ ముఠాలకు తగిన గుణపాఠం చెప్పాలి. సౌమ్య కుటుంబానికి అండగా ఉంటామని హామీ ఇస్తున్నా. బీఆర్ఎస్ అధినేత కేసీఆర్ ఉద్యమకారులకు, అమరవీరుల కుటుంబాలకు దూరం కావటానికి కారణం సంతోష్ రావు. గద్దర్ లాంటి నాయకులు గంటలు గంటలు గేట్ బయట వేచి చూడటం, ఈటల లాంటి వారు బయటకు రావటానికి కూడా ఈ సంతోష్ రావే కారణమని ఆరోపించారు.

# మంత్రుల భేటీ.. తప్పేముంది: మహేష్ గౌడ్

**మొదటి పేజీ తరువాయి**

జీవన్‌రెడ్డి భేటీలో చర్చించిన విషయాలను డిప్యూటీ సీఎం భట్టికి మంత్రి ఉత్తమ్ వివరించినట్లు సమాచారం.మున్సిపల్ ఎన్నికల సమయం దగ్గరపడుతుండటంతో మంత్రుల మధ్య అంతర్గత విభేదాల పరిష్కారంపై ఈ భేటీలో ప్రధానంగా చర్చించినట్లు తెలుస్తోంది. ఎన్నికల్లో విజయం కోసం పార్టీ శ్రేణులకు దిశా నిర్దేశంపై మంత్రులు చర్చించారు. పంచాయతీ ఎన్నికల కంటే ఎక్కువ స్థాయిలో పార్టీ విజయం సాధించడానికి వ్యూహాలకు పదునుపెట్టారు. వీటితో పాటు ఇటీవల కాంగ్రెస్ మంత్రుల మధ్య వివాదాస్పదమైన సింగరేణి సంస్థకు చెందిన నైనీ బొగ్గు గని టెండర్ల రద్దుపై సాగుతున్న ప్రచారంపై సైతం చర్చించి ఉంటారు. టెండర్ల కేటాయింపు ప్రక్రియలో పూర్తి పారదర్శకత కోసమే, ఆరోపణలు రాగానే ప్రభుత్వం నైనీ టెండర్లను రద్దు చేసిందని ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క మంత్రులకు వివరించారు. కేవలం ఈ టెండర్ కోసమే సైట్ విజిట్ సర్టిఫికెట్ తీసుకురాలేదని, గతం నుంచి ఉందన్నారు.తెలంగాణ మంత్రులు నలుగురు అత్యవసర భేటీపై నెలకొన్న రాజకీయ ఉత్కంఠపై టీపీసీసీ చీఫ్ మహేశ్ కుమార్ గౌడ్ స్పందించారు. సీఎం రేవంత్ రెడ్డి విదేశీ పర్యటనలో ఉన్న సమయంలో, డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క నేతృత్వంలో నలుగురు మంత్రులు సమావేశం కావడంలో ఆశ్చర్యం లేదన్నారు. సీఎం అందుబాటులో లేనప్పుడు పాలనాపరమైన అంశాలపై మంత్రులు చర్చించుకోవడంలో తప్పులేదన్నారు. ప్రభుత్వ యంత్రాంగం సజావుగా సాగడానికి మంత్రుల మధ్య సమన్వయం అవసరం. అందులో భాగంగానే భట్టితో ముగ్గురు మంత్రులు భేటీ అయ్యారని అభిప్రాయపడ్డారు. భట్టి నేతృత్వంలో మంత్రుల సమావేశం వెనుక ఎటువంటి రాజకీయ కుట్రలు లేవని, కేవలం రాష్ట్ర పరిస్థితులు, ప్రభుత్వ ప్రాధాన్యతలపై చర్చించేందుకే భేటీ అయ్యారని మహేష్ కుమార్ గౌడ్ పేర్కొన్నారు. కేబినెట్ మంత్రుల మధ్య సమన్వయం ఉండటం వల్ల పరిపాలనలో జాప్యం జరగదని, అపార్థాలు ఉండవన్నారు. ప్రజలకు సేవలు అందడంలో ఎలాంటి ఇబ్బందులు ఉండవని పార్టీ భావిస్తోంది. సీఎం రేవంత్ రెడ్డి విదేశాల నుంచి తిరిగి వచ్చిన తర్వాతే రాష్ట్ర పరిస్థితులపై సమగ్ర సమీక్ష జరుగుతుందని, అనంతరం హైకమాండ్‌కు నివేదిక సమర్పిస్తామని మహేశ్ కుమార్ గౌడ్ చెప్పుకొచ్చారు.

# దౌల్తాబాద్ వాసికి గవర్నర్ ఎక్సలెన్స్ అవార్డు



**దశ, దౌల్తాబాద్:** గణతంత్ర దినోత్సవం సందర్భంగా సిద్దిపేట జిల్లా దౌల్తాబాద్ మండల కేంద్రానికి చెందిన అరుణ్‌కుమార్‌కు ప్రతిష్టాత్మకమైన గవర్నర్ ఎక్సలెన్స్ అవార్డు లభించింది. సామాజిక సేవా రంగంలో ఆయన చేసిన విశిష్ట సేవలకు గుర్తింపుగా గవర్నర్ జిష్ణు దేవ్ వర్మ చేతుల మీదుగా లోక్‌భవన్‌లో ఈ అవార్డును ప్రదానం చేశారు. సామాజిక సేవలో నిరంతరం చురుకుగా పనిచేస్తూ గివ్ సంస్థకు ప్రాతినిధ్యం వహిస్తున్న అరుణ్‌కుమార్ ప్రజల సంక్షేమం కోసం చేసిన కృషి ప్రశంసనీయమని గవర్నర్ పేర్కొన్నారు. సేవాభావం, బాధ్యతాయుతమైన కార్యక్రమాల నిర్వహణ, పేదల పట్ల ఆయన చూపిన అంకితభావం ఆదర్శనీయమని ఈ సందర్భంగా గవర్నర్ అభినందించారు. అవార్డు స్వీకరించిన అనంతరం అరుణ్‌కుమార్ మాట్లాడుతూ ఈ గౌరవం తన వ్యక్తిగత విజయం కాదని, తన గ్రామానికి, తనతో కలిసి సేవా కార్యక్రమాల్లో భాగస్వాములైన ప్రతి ఒక్కరికీ దక్కిన గౌరవమని అన్నారు.

Printed, Published and Owned by B.KALPANA and Printed at Kalpana Publications , Flat No.101,Sri Heights Apartment,Shilpi Colony,Pasumamula Road,Pedda Amberpet,Rangareddy,Telangana-501505, and Published at Flat No.101,Sri Heights Apartment,Shilpi Colony,Pasumamula Road,Pedda Amberpet,Rangareddy,Telangana-501505. Editor: B.KALPANA. PRGI.No.TGTEL/25/A4195. Cell 9848288850, namasteshekar@gmail.com